# ‘కింగ్‌డమ్’ కాస్త ఆలస్యం

## జూలై 4న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటన




అగ్ర హీరో విజయ్ దేవరకొండ తాజా చిత్రం ‘కింగ్‌డమ్’ విడుదల వాయిదా పడింది. ఈ సినిమాను జూలై 4న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ముందస్తు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 30న సినిమా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల దేశంలో చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం కష్టమని భావించి ముందుగా అనుకున్న రోజున రిలీజ్ చేయలేకపోతున్నామని చిత్ర బృందం పేర్కొంది.‘వాయిదా నిర్ణయం సినిమాకు మరిన్ని మెరుగులుదిద్ది, మరింత ఉన్నతీకరించడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. కాస్త ఆలస్యమైనా సరే అభిమానుల అంచనాల్ని అందుకొని ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకం ఉంది’ అని మేకర్స్ ఓ ప్రకటనలో తెలిపారు. పీరియాడిక్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ‘వలసపోయినా..అలసిపోయినా ఆగిపోనిది ఈ మహారణం, ఈ అలజడి ఎవరి కోసం? ఇంత భీభత్సం ఎవరి కోసం?...రణభూమిని చీల్చుకొని పుట్టే కొత్త రాజు కోసం, కాలచక్రాన్ని బద్దలుకొట్టి పునర్జన్మనెత్తిన నాయకుడి కోసం’ అంటూ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో విడుదల చేసిన ఈ చిత్ర టీజర్ అభిమానుల అంచనాల్ని రెట్టింపు చేసింది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాణ సంస్థ: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, రచన-దర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

# అదృష్టం పలకరించింది!



‘రెట్రో’ సినిమా సక్సెస్‌తో మంగళూరు సోయగం పూజాహెగ్డే పట్టరాని సంతోషంతో ఉంది. ఈ భామకు గత రెండేళ్లుగా ఒక్క సక్సెస్ రాలేదు. అగ్ర హీరోలతో నటించిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద ఫ్లాపయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ భామ కెరీరే ప్రశ్నార్థకంగా మారింది. అయితే సూర్య సరసన నటించిన ‘రెట్రో’ చిత్రం ఈ భామ కెరీర్‌కు కొత్త ఊపిరిలూదింది. ఈ సినిమాలో డీగ్లామర్ పాత్రలో పూజాహెగ్డే అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. చాలా విరామం తర్వాత ఆమె నటిగా సత్తాచాటిందని, ఇకపై ఇలాంటి రోల్స్ ఎంచుకోవాలని సోషల్‌మీడియాలో అభిమానులు అభిప్రాయపడ్డారు. ‘రెట్రో’ సక్సెస్‌తో తన కెరీర్‌కు మంచి రోజులొచ్చాయని, ఇకపై కథాంశాల ఎంపికలో మరింత జాగ్రత్తగా ఉంటానని, గ్లామర్ రోల్స్‌తో పాటు పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ చిత్రాలను ఎంపిక చేసుకుంటానని అభిమానులకు భరోసానిస్తున్నది పూజాహెగ్డే. తమిళంలో తాను విజయ్‌తో చేస్తున్న ‘జన నాయగన్’, లారెన్స్‌తో నటిస్తున్న ‘కాంచన-4’ చిత్రాలు తప్పకుండా భారీ హిట్స్‌గా నిలుస్తాయనే ధీమాతో ఉందట పూజాహెగ్డే. మొత్తానికి ‘రెట్రో’ విజయంతో పూజాహెగ్డే మళ్లీ సక్సెస్‌ట్రాక్‌లోకి వచ్చిందని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# భాగ్యనగరిలో ‘ఓజీ’ యాక్షన్



రాజకీయాలకు కాస్త బ్రేక్‌నిచ్చి ఇక వరుసగా తన సినిమాలను పూర్తి చేసే పనిలో పడ్డారు అగ్ర హీరో పవన్‌కల్యాణ్. ఇటీవలే ఆయన ‘ఓజీ’ షూటింగ్‌లో జాయిన్ అయిన విషయం తెలిసిందే. ‘మళ్లీ మొదలైంది..ఈసారి ముగిద్దాం’ అంటూ చిత్ర బృందం సోషల్‌మీడియాలో చేసిన పోస్ట్‌తో అభిమానులు ఖుషీ అయ్యారు. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా ఇది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. పవన్‌కల్యాణ్ ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో పాల్గొంటున్నారని, ఇది సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని చిత్రబృందం చెబుతున్నది. సాధ్యమైనంత తొందరలో ఈ సినిమాను పూర్తి చేయాలనే ఆలోచనలో పవన్‌కల్యాణ్ ఉన్నట్లు సమాచారం. ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు.

# ఎనిమిది భాషలు మాట్లాడతా!



‘నా ప్రతీ సినిమాకు పదిమంది ఆడియెన్స్ అయినా పెరగాలి. అదే లక్ష్యంతో విభిన్న పాత్రల్ని ఎంచుకుంటున్నా. దక్షిణాది అన్ని భాషల్లో మంచి ఆఫర్లొస్తున్నాయి’ అన్నారు హీరో నవీన్‌చంద్ర. ఆయన నటించిన తాజా చిత్రం ‘లెవన్’ ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇది. లోకేష్ అజ్ల్స్ దర్శకుడు. అజ్మల్‌ఖాన్, రేయా హరి నిర్మాతలు. ఈ సందర్భంగా బుధవారం నవీన్‌చంద్ర విలేకరులతో సినిమా విశేషాలను పంచుకున్నారు. తెలుగు, తమిళంలో ద్విభాషా చిత్రంగా రూపొందించామని, తమిళంలో వేసిన ప్రీమియర్‌షోస్‌కు అద్భుతమైన స్పందన లభించిందని, ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ‘ఇప్పటివరకు ఈ తరహా థ్రిల్లర్ రాలేదు. ఇదొక డిఫరెంట్ కాన్సెప్ట్. ప్రతీ సంఘటనకు లాజిల్ ఉంటుంది. కథలోని మలుపులను ఎవరూ ఊహించలేరు. రెండు భాషల్లో డిఫరెంట్ షాట్స్‌తో సినిమా తీశాం’ అని నవీన్‌చంద్ర తెలిపారు. ఈ సినిమా తమిళ వెర్షన్‌కు డబ్బింగ్ తానే చెప్పానని, దక్షిణాది నాలుగు భాషలతో పాటు హిందీ, మరాఠీ, బెంగాలీ, పంజాబీ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలనన్నారు. తాను నటిస్తున్న తాజా చిత్రాల వివరాలను తెలియజేస్తూ ‘రవితేజ ‘మాస్ జాతర’ చిత్రంలో విలన్‌గా నటిస్తున్నా. నన్ను రవితేజగారే రిఫర్ చేశారు. ‘అరవింద సమేత వీర రాఘవ’ చిత్రంలో నా పాత్రను ఎంత యూనిక్‌గా ఫీలయ్యారో అదే రీతిలో ‘మాస్ జాతర’లోని పాత్ర మెప్పిస్తుంది. కరుణకుమార్ దర్శకత్వంలో ‘హనీ’ అనే డార్క్ కామెడీ సినిమా చేస్తున్నా. అలాగే ‘కాళీ’ అనే యాక్షన్ మూవీలో నటిస్తున్నా. హరి అనే దర్శకుడితో ఓ కామెడీ సినిమా చేస్తున్నా. కెరీర్‌లో తొలిసారి కామెడీ చేయడం ఆనందంగా ఉంది’ అన్నారు.

# నాని ప్రొడక్షన్‌లో దుల్కర్ సల్మాన్?





ఇప్పుడు తెలుగులో నాని టైమ్ నడుస్తున్నది. హీరోగా వరుస బ్లాక్‌బస్టర్స్‌తో సత్తాచాటుతూనే..మరోవైపు నిర్మాతగా కూడా రాణిస్తున్నారు. ఇక దుల్కర్‌సల్మాన్ దక్షిణాదిలోనే విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నారు. మలయాళంతో పాటు తెలుగులో కూడా ఆయనకు మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. తాజా సమాచారం ప్రకారం దుల్కర్ సల్మాన్‌తో నాని తన ప్రొడక్షన్‌లో ఓ సినిమా తీసేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ‘కోర్ట్’ చిత్ర దర్శకుడు రామ్ జగదీష్ డైరెక్షన్‌లో దుల్కర్ సల్మాన్ సినిమాకు ఓకే చేశారని ఫిల్మ్‌నగర్ వార్త. వీరిద్దరి కాంబో కార్యరూపం దాల్చితే మరో బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయమని అభిమానులు అంటున్నారు. అయితే ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం నాని..శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో హైదరాబాద్ నేపథ్య పీరియాడిక్ చిత్రం ‘ప్యారడైజ్’లో నటిస్తున్నారు. ఇక దుల్కర్ సల్మాన్ తమిళంలో ‘కాంత’, మలయాళంలో ‘ఐ యామ్ గేమ్’ చిత్రాలతో బిజీగా ఉన్నారు.



# తెలుగులో ‘కేసరి ఛాప్టర్-2’

అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా నటించిన హిస్టారికల్ కోర్ట్‌రూమ్ డ్రామా ‘కేసరి ఛాప్టర్-2’ ’ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్‌వాలా బాగ్’ విజయవంతంగా ప్రదర్శింపబడుతూ మంచి వసూళ్లను సాధిస్తున్నది. తాజాగా ఈ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ఈ నెల 23న విడుదల చేయబోతున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నది. కరణ్‌సింగ్ త్యాగీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆర్.మాధవన్, అనన్య పాండే ముఖ్య పాత్రల్ని పోషించారు. ‘ది కేస్ దట్ షుక్ ది ఎంపైర్’ అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. జలియన్‌వాలాబాగ్ మారణహోమాన్ని కోర్టులో సవాలు చేసి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన న్యాయవాది సి.శంకరన్ నాయర్ జీవిత కథ స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. హిందీలో ధర్మా ప్రొడక్షన్స్, లియో మీడియా కలెక్టివ్, కేఫ్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించాయి.

# విజయ్ ఆంటోని క్రైమ్ థ్రిల్లర్



విజయ్ ఆంటోని నటిస్తున్న తాజా చిత్రం ‘మార్గన్’. లియోజాన్ పాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ నిర్మిస్తున్నది. మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ ఇది. జూన్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో బుధవారం విజయ్ ఆంటోని ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ‘యాక్షన్ ప్యాక్డ్ క్రైమ్ థ్రిల్లర్ ఇది. విజయ్ ఆంటోని పాత్ర శక్తివంతంగా సాగుతుంది. కథలోని ఫ్యామిలీ ఎలిమెంట్స్ అందరిని ఆకట్టుకుంటాయి’ అని మేకర్స్ తెలిపారు. అజయ్ దీపన్, సముద్రఖని, శంకర్, ప్రీతిక, బ్రిగిడా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, రచన-దర్శకత్వం: లియో జాన్‌పాల్.

# న్యాయ వ్యవస్థలోని లోపాల్ని ప్రశ్నించాను!

‘ఇద్దరు వ్యక్తులు ఒకే తప్పు చేస్తే అందులో ఓ వ్యక్తికి 24గంటల్లో బెయిల్ వస్తుంది. మరొకరికి రెండేళ్లయినా రాదు. వ్యవస్థలోని ఇలాంటి తప్పుల్ని ఎత్తిచూపుతూ చిలకలూరిపేట బస్సు దహనం, చుండూరు ఘటన, జూబ్లీహిల్స్ బాంబ్‌బ్లాస్ట్స్ నేపథ్యంలో ఈ సినిమా తీశా’ అన్నారు దర్శకుడు రాజ్ ఆర్. ‘మల్లేశం’ ‘8ఏమ్ మెట్రో’ చిత్రాలతో టాలెంటెడ్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందిన ఆయన రూపొందించిన తాజా చిత్రం ‘23’ ఈనెల 16న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం రాజ్ ఆర్ పాత్రికేయులతో ముచ్చటించారు. తాను ఈ సినిమాలో చాలా సెన్సిటివ్ అంశాలను చర్చించానని, మన న్యాయవ్యవస్థలోని లోపాల్ని ఎత్తిచూపానని అన్నారు. ‘ఓ జర్నలిస్ట్ మిత్రున్ని కలిసినప్పుడు చిలకలూరిపేట బస్సు దహనం గురించి చెప్పాడు. యాదృచ్ఛికంగా అదే రాత్రి మరో మిత్రుడు చుండూరు ఘటన గురించి మాట్లాడారు. వాస్తవానికి ఈ రెండు ఘటనల్లో సినిమాకు అవసరమయ్యే కథ లేదు. కానీ ఆ రెండింటిని భిన్నకోణాల్లోంచి చూస్తే ఓ కథగా సిద్ధం చేయొచ్చు అనిపించింది. అలా ఈ సబ్జెక్ట్‌కు అంకురార్పణ జరిగింది’ అన్నారు. తాను తీసే ప్రతీ కథకు ఓ పర్పస్ ఉంటుందని, తన సినిమా టార్గెట్ ఆడియెన్స్‌కు చేరువైతే దర్శకుడిగా లక్ష్యం నెరవేరినట్లేనని రాజ్ ఆర్ అన్నారు. ‘ఈ కథలో మల్టీపుల్ థీమ్స్‌తో పాటు ఓ లవ్‌స్టోరీ ఉంటుంది. నటీనటులు అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచారు. ఈ సినిమా విషయంలో సెన్సార్ నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నా. చాలా సీన్స్, మాటలను తీసేయమని చెప్పారు. గతంలో అనేక చిత్రాల్లో అవే సన్నివేశాలకు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. చట్టం అందరికి సమానంగా వర్తించాలి. కానీ అలా జరగడం లేదు. దీనిని ఎవరో ఒకరు ప్రశ్నించాలి. అలాంటి ప్రశ్నల్ని రేకెత్తించే సినిమా ఇది’ అని రాజ్ ఆర్ పేర్కొన్నారు.



# ‘కరాటే కిడ్’ ట్రైలర్ విడుదల



సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా నిర్మించిన ‘కరాటే కిడ్: లెజెండ్స్’ హిందీ ట్రైలర్‌ను బుధవారం అగ్ర హీరో అజయ్ దేవ్‌గన్ తన కుమారుడు యుగ్ దేవ్‌గన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సినిమాలో జాకీచాన్ పోషించిన మిస్టర్ హాన్ పాత్రకు అజయ్ దేవ్‌గన్, లీఫాంగ్ పాత్రకు యుగ్‌దేవ్‌గన్ హిందీలో డబ్బింగ్ చెప్పిన విషయం తెలిసిందే. తండ్రీ కొడుకుల అనుబంధం ప్రధానంగా తెరకెక్కిన ఈ కథకు వారిద్దరి డబ్బింగ్ హైలైట్‌గా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. ‘కరాటే కిడ్: లెజెండ్స్’ చిత్రాన్ని న్యూయార్క్ నేపథ్య కథాంశంతో తెరకెక్కించారు. స్ఫూర్తివంతమైన కథతో ఈ సినిమా భారతీయ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ నెల 30 ఈ చిత్రం విడుదలకానుంది.

# టర్కీలో షూటింగ్స్ చేయొద్దు!

పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత ప్రభుత్వం చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ విషయంలో టర్కీ దేశం వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలొచ్చాయి. టర్కీతో పాటు అజర్‌బైజాన్ దేశాలు పాకిస్థాన్‌కు బాహాటంగానే మద్దతు ప్రకటించాయి. పాకిస్థాన్ సైన్యానికి టర్కీ డ్రోన్లను కూడా సరఫరా చేసింది. ఈ నేపథ్యంలో ఆ రెండు దేశాల్లో భారతీయ సినిమాల చిత్రీకరణలు జరపొద్దనే డిమాండ్స్ ఎక్కువవుతున్నాయి. తాజాగా ఈ విషయంపై వెస్టన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ ఓ ప్రకటన జారీ చేసింది. జాతీయ సమగ్రత, భద్రతను దృష్టిలో పెట్టుకొని భారతీయ దర్శకనిర్మాతలు టర్కీ, అజర్‌బైజాన్ దేశాల్లో షూటింగ్‌లకు దూరంగా ఉండాలని కోరింది. ‘జాతి ప్రయోజనాల కోసం అందరూ ఐక్యంగా ఉండాలి. అంతర్జాతీయ వేదికలపై కూడా టర్కీ.. పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచింది. ఇది చాలా తీవ్రమైన విషయం. భారత సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే ఇలాంటి చర్యలని అందరూ ప్రతిఘటించాలి. ఇక ఆ దేశాల్లో షూటింగ్‌లను రద్దు చేసుకోవాలి’ అని ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. ఈ విషయం గురించి ఇండో-టర్కిష్ ఫిల్మ్ మేకర్ ప్రేమ్‌రాజ్ సోనీ కూడా స్పందించారు. ఇది స్వాగతించాల్సిన నిర్ణయమని, టర్కీలో షూటింగ్ పరంగా ఎలాంటి రాయితీలు లేవని, కేవలం అక్కడి ప్రకృతి అందాల కోసం షూటింగ్స్‌కు వెళ్తున్నామని ఆయన చెప్పారు.





